లోపించిన పారిశుధ్యం

- చోద్యం చూస్తున్న అధికారులు
- సమ్మెలో జీపీ కార్మికులు


బిచ్కుందలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

బిచ్కుంద(జుక్కల్): తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఐదు రోజుల నుంచి పంచాయతీ కార్మికులు జిల్లా వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడుతున్న సంగతి తెల్సిందే. అధికారులు, పాలకులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకొని పారిశుధ్య పనులు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఐదు రోజుల నుంచి రోడ్లు శుభ్రం చేసి చెత్తను ఎత్తేవారు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ రోడ్లపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో కుళ్లిపోయిన చెత్తతో దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామాలు, మండల కేంద్రాలలో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పారిశుధ్య లోపంతో అనారోగ్యం బారిన పడతామని, మురికితో సహజీవనం చేయాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఇళ్ల ముందు వీధులలో చెత్త కుప్పలు పేరుకుపోయి డంపింగ్‌యార్డును తలపిస్తున్నాయి. అలాగే చెత్త, పాలిథీన్ కవర్లు మురికి కాలువలో కూరుకుపోవడంతో వర్షం నీరు రోడ్లపై ప్రవహించి బిచ్కుందలో 13, 14, 15 వార్డులలో గల ఇళ్లలో వస్తున్నాయి. దినసరి కూలీలతో రోడ్లపై ఉన్న చెత్తను తొలగించి మురికి కాలువలు శుభ్రం చేయించాలని పంచాయతీ అధికారులను ప్రజలు వేడుకున్నా ఎలాంటి స్పందన లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూలి డబ్బులు ఇవ్వడానికి జీపీలలో నిధులు లేవు.. సమ్మె విరమించి కార్మికులు విధులలో చేరే వరకు ఆగాలని పాలకులు, అధికారులు అంటున్నారు. ప్రజా ఆరోగ్యంపై ఎవ్వరు పట్టించుకోకపోవడం బాధాకరంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

జీవో–60 ప్రకారం వేతనాలు పెంచి, ఉద్యోగ క్రమబద్ధీకరణ చేసి, మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలోని 526 జీపీలకు చెందిన 3,480 మంది కార్మికులు ఉన్నారు. బి చ్కుంద, మద్నూర్, పిట్లం, బీబీపేట్, బిక్కనూర్, సదాశివనగర్, రాజంపేట్, దోమకొండ ఆయా మండలాలలో జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు సమ్మె బాట పట్టారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని అంటున్నారు.

కూలీలను పెట్టి శుభ్రం చేయిస్తాం

కొన్ని మండలాలో కార్మికులు సమ్మె చేస్తున్నారు. దినసరి కూలీలు పెట్టి పారిశుధ్య పనులు చేయించాలని కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. చెత్తను తొలగించి కాలువలు శుభ్రం చేస్తారు. జీపీ ద్వారా కార్మికుల పేర్లతో ఇన్సూరెన్సు కట్టడానికి సిద్ధంగా ఉన్నాం విధుల్లో చేరాలని కోరుతున్నాం.

– శ్రీనివాస్, డీఎల్‌పీవో బాన్సువాడ

క్లుప్తంగా

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గోనె శ్రీనివాస్



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కామారెడ్డి పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ గోనె శ్రీనివాస్‌ను నియమించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ నియామకపత్రాన్ని అందజేశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు. డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా హన్మంత్‌రెడ్డి ?

భిక్కనూరు: భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన పట్లూరి హన్మంత్‌రెడ్డిని నియమించేందుకు కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నిర్ణయించుకున్నారు. ఈమేరకు గోవర్ధన్ సోమవారం హన్మంత్‌రెడ్డిని తన వద్దకు పిలిపించుకుని చైర్మన్‌గా నియమిస్తున్నామని రైతులకు సేవలు చేయాలని సూచించారు. హన్మంత్‌రెడ్డి ప్రస్తుతం భిక్కనూరు వ్యవసాయ మార్కె ట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఉన్నారు. రెండు మూడు రోజుల్లో చైర్మన్‌గా నియమించినట్లు ఉత్తర్వులు జారీకానున్నాయి. హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ..తనపై నమ్మకంతో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇచ్చారని, కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

కొనసాగుతున్న నిరసన దీక్షలు

భిక్కనూరు: కాచాపూర్‌లో ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా వీడీసీ ఆధ్వర్యంలో గ్రామస్తులు చేస్తున్న నిరసన దీక్షలు 77వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం గ్రామానికి చెందిన పలు కుల సంఘాల వారు, పలు పార్టీల నేతలు దీక్ష శిబిరంలో కూర్చుని పర్యావరణాన్ని పరిరక్షించండి కాచాపూర్ గ్రామాన్ని రక్షించండి అంటూ నినదించారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ విద్యార్థి వడ్డె శంకర్(21) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. వివరాలు..ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం నవేగూడకు చెందిన వడ్డె శంకర్ (21) తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో ఎంఏ తెలుగు మొదటి సంవత్సరం చదువుతున్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పలువురు సౌత్ క్యాంపస్ విద్యార్థులు నవేగూడకు వెళ్లి శంకర్ నివాళులర్పించారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరణ



మాచారెడ్డి: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సోమవారం మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో కామారెడ్డిలోని వినాయకనగర్ కాలనీ ఉద్యోగులు సంకల్ప యాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వాల్ పోస్టర్లను స్వామి వారి ముందుంచి ప్రత్యేక పూజలు చేయించారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక

కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విభూది స్రవంతి పదవ తరగతిలో 9.7 జీపీఏ సాధించి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు స్రవంతిని శాలువా, నగదు పారితోషికంతో ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు చంద్రావతి, సర్పంచ్ రత్నాబాయి పాల్గొన్నారు.

బీజేపీ నేతకు సన్మానం



కామారెడ్డి టౌన్: పట్టణ పరిధిలోని 2వ వార్డు రామేశ్వరపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డిని ఘనంగా సన్మానించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ ఆలయ సీసీ స్లాబ్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ సుతారి రవి తదితరులున్నారు.

అక్రమంగా మొరం తవ్వకాలు

నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేటలోని నీటి పారుదల శాఖ స్థలాల్లో అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. అచ్చంపేట క్యాంపు ఆవరణలో ఉన్న ఇరిగేషన్ కార్యాలయ క్వార్టర్ వెనుకభాగంలో మొరం తవ్వకాలు జోరుగా చేపడుతున్నారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ల కోసం మొరం తవ్వకాలు చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతున్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాజకీయ ప్రలోభాలకు లొంగొద్దు


సమావేశమైన సదర్ సంఘం ప్రతినిధులు

భిక్కనూరు: ముదిరాజులను రాజకీయ ప్రలోభాలకు లొంగదీసుకునేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని, ప్రలోభాలకు లొంగవద్దని భిక్కనూరు ముదిరాజు సదర్ సంఘం అధ్యక్షుడు బండి రాములు కోరారు. సోమవారం భిక్కనూరు మండల కేంద్రంలో నిర్వహించిన ముదిరాజు సదర్ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ముదిరాజు కులస్తుడు పార్టీలకతీతంగా సంఘం అభివృద్ధికి కృషిచేయాలన్నారు. కొందరు ముదిరాజుల ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్రపన్ని పలు పార్టీల్లో చేరినట్లు ప్రకటనలు ఇప్పిస్తున్నారన్నారు. ముదిరాజు సదరు సంఘానికి ఏ పార్టీతో సంబంధం లేదన్నారు. సమావేశంలో ముదిరాజు సంఘం 15 పాండీల సభ్యులు, నేతలు గజ్జెల భిక్షపతి, నంద రమేశ్, ఇస్సాని పేట రాజు, తదితరులు పాల్గొన్నారు.

దూప్‌సింగ్ తండా రైతులకు న్యాయం చేయాలని వినతి



కామారెడ్డి అర్బన్/కామారెడ్డిటౌన్: కామారెడ్డి అటవీ ప్రాంతంలో పోడు భూములు సాగుచేస్తున్న 12 మంది మెదక్ జిల్లా వాడి పంచాయతీ పరిధిలోని దూప్‌సింగ్ తండా రైతులకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కామారెడ్డి ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. దూప్‌సింగ్ తండా పంచాయతీ కార్యదర్శి, సర్పంచులు సంబంధించిన అధికారులకు రైతుల దరఖాస్తులు పంపకుండా పోడు సాగుచేస్తున్న రైతులకు అన్యాయం చేశారని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా రైతులకు అన్యాయం చేశారని, అధికారులు వెంటనే విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

రోడ్లపై అక్రమంగా వేసుకున్న షెడ్లను తొలగించాలి


కొలతలు తీసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

బాన్సువాడ: మున్సిపాలిటీ పరిధిలోని డెయిలీ మార్కెట్‌లో అక్రమంగా రోడ్లపై వేసుకున్న షెడ్లను సోమవారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ తొలగించారు. రోడ్లపై షెడ్లు వేసుకోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పాడుతున్నాయని, రోడ్ల వెంట డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. షెడ్ల తీసివేయకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, కౌన్సిలర్ అమేర్, సిబ్బంది మల్లికార్జున్‌రెడ్డి, హన్మండ్లు, రవీందర్‌రెడ్డి, తదితరులున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


సదాశివనగర్‌లో సమ్మె నిర్వహిస్తున్న జీపీ కార్మికులు


తాడ్వాయిలో తహసీల్దార్ వెంకటేశ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న జీపీ కార్మికులు

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చేపడుతున్న గ్రామ పంచాయితీ కార్మికుల సమ్మె సోమవారం కూడా కొనసాగింది. పంచాయితీల్లో విధులు నిర్విర్తించే ప్రతి ఒక్కరికి ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు కోరారు. అలాగే మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను తీర్చేంత వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. అనంతరం తహసీల్దార్‌లకు, పోలీసులకు వినతిపత్రాలు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్


బీబీపేటలో మద్దతు తెలుపుతున్న బీఎల్‌పీ సభ్యులు


భిక్కనూరులో ..

సంక్షిప్తం

రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్‌ను కలిసిన ముదిరాజ్‌లు



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేటకు చెందిన పలువురు ముదిరాజ్ నాయకులు సోమవారం రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ పిట్టల రవీందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల ముదిరాజ్ అధ్యక్షుడు దాసరి సాయికుమార్ మట్లాడారు. నూతన మత్స్య సహకార సొసైటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ముదిరాజ్‌ల స్థితిగతులు చైర్మన్‌కు వివరించారు. మార్గం సాయిలు, దాసరి పర్వయ్య, గోపి, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పిట్లం(జుక్కల్): అన్నారాంలో గ్రామానికి చెందిన గంగామణి కుటుంబానికి సోమవారం పిట్లం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నారం వెంకట్రామ్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, సభ్యులు కాశిరెడ్డి, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తిర్మలాపూర్‌లో ఇంటింటికి మొక్కలు..

బాన్సువాడ రూరల్: తిర్మలాపూర్‌లో సోమవారం ప్రతి ఇంటికి 6 చొప్పున మొక్కలు పంపిణీ చేసినట్లు సర్పంచ్ జిన్న రఘురామయ్య తెలిపారు. పంపిణీ చేసిన మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఆయన కోరారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

బీబీపేట: మండలంలోని ఇస్సానగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పొట్టిగారి పొట్టయ్య కాంగ్రెస్ పార్టీని వీడి సోమవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు పొట్టయ్య పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో..

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలోని 4, 20వ వార్డులకు చెందిన యువకులు సోమవా రం కాంగ్రెస్ పార్టీలో చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇలియాస్ సమక్షంలో వారు పార్టీలో చేరారు. నాయకులు నయీం, శ్రీనివాస్ తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బాన్సువాడ: పట్టణంలోని 13వ వార్డులో రూ.1.10 కోట్ల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో మున్సిపాలిటీ పరిధిలో రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఆయన వెంట వైస్ చైర్మన్ జుబేర్, కౌన్సిలర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

భిక్కనూరు: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో వీవోఏలకు ఆర్థిక అక్షరాస్యతపై సోమవారం అవగాహన కల్పించారు. వచ్చే ఆదాయం నుంచి అనవసరపు ఖర్చులు తగ్గించుకుని పొదుపు చేసుకుని ఆర్థికంగా ఎలా అభివృద్ధి చెందవచ్చన్న విషయంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎంజీ రాంచంద్రగౌడ్, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

సమాచారం..

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

బిచ్కుంద(జుక్కల్): రైతు బీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ నూతన్ కుమార్ తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సున్న వారు అర్హులని సూచించారు. పట్టా పాస్‌బుక్, పట్టాదారు రైతు ఆధార్, నామినీ ఆధార్, రైతు బీమా ఫారం జత చేసి గ్రామ ఏఈవోలకు అందించాలని రైతులను కోరారు.

మోడల్ స్కూల్లో ఖాళీ సీట్లకు..

మద్నూర్(జుక్కల్): మండలంలోని మేనూర్ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి పేర్కొన్నారు. ఆరవ తరగతిలో 50 సీట్లు, ఏడవ తరగతిలో 11, ఎనిమిదవ తరగతిలో 15, తొమ్మిదవ తరగతిలో 12, పదవ తరగతిలో ఆరు సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ చెప్పారు. ఆధార్‌కార్డు, బోనాఫైడ్, రెండు ఫొటోలతో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మంగళవారం నుంచి గురువారం లోపు పాఠశాలలో విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. అలాగే ఇంటర్మీడియెట్‌లో కూడా ఎంపీసీలో 10, బైపీసీలో 10, సీఈసీలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు వినియోగించుకోవాలి


మాందాపూర్‌లో వైద్య శిబిరంలో పాల్గొన్న లయన్స్‌క్లబ్ సభ్యులు, ప్రజలు

బీబీపేట: రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న అన్నారు. సోమవారం మాందాపూర్, ఉప్పర్‌పల్లి గ్రామాల్లో మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల వ్యాధులకు అవసరం ఉన్న వారికి ఆపరేషన్ చేయిస్తామన్నారు. ఎంపీపీ బాలమణి, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ నాగరాజ్‌గౌడ్, మండల చైర్మన్ బాశెట్టి నాగేశ్వర్, వైస్ చైర్మన్ స్వామి, ఉప సర్పంచ్ బాపురెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో మార్పులు చేసుకోవచ్చు


మాట్లాడుతున్న తహసీల్దార్ గంగాధర్

బాన్సువాడ : ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేసుకునేందుకు అవకాశం ఉందని తహసీల్దార్ గంగాధర్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు తొలగించాలని, 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటరు జాబితాలో పేర్లు చేర్పుకోవచ్చునని అన్నారు. చాలా మంది ఓటర్ల ఆధారు కార్డు అనుసంధానం చేసుకోలేదని, అలాంటి వారిని గుర్తించి ఆధారు కార్డుకు ఓటరు పేరును అనుసంధానం చేయాలని అన్నారు. ప్రతి వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఇంట్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారో గుర్తించాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వైస్ చైర్మన్ జుబేర్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సర్కార్ బడిలోనే నాణ్యమైన విద్య


విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న ఎంపీపీ దశరథ్ రెడ్డి


కోనాపూర్‌లో.. సర్పంచ్ రమణారావు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): సర్కార్ బడులు, వసతి గృహాలలో నాణ్యమైన పౌష్టికాహారం, విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ దశరథ్‌రెడ్డి అన్నారు. ఉప్పల్‌వాయి ప్రభుత్వ షెడ్యూల్ కులాల వసతి గృహంలో ఎంపీపీ దశరథరెడ్డి సోమవారం విద్యార్థులకు పుస్తకాలు, నోటు బుక్కులు, నూతన వస్త్రాలు, ఫర్నిచర్ అందించారు. సర్పంచ్ కొత్తోళ్ల గంగారాం, ఉపసర్పంచ్ సరస్వతి, మండలం రైతుబంధు అధ్యక్షులు నారాయణ రెడ్డి, ఎంపీటీసీ ఉమాదేవి, వార్డెన్ మమత తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

బాన్సువాడ రూరల్: ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కటి విద్యాబుద్ధులు నేర్పి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోనాపూర్ సర్పంచ్ వెంకటరమణారావు కోరారు. సోమవారం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకోసం తెలంగాణ ప్రభుత్వం సరఫరా చేసిన నోట్‌బుక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు చారి, ఎస్ఎంసీ చైర్మన్ ఈశ్వర్‌గౌడ్, తదితరులున్నారు.

పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి రూ.25 లక్షలు


స్పీకర్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ కులస్తులు

బాన్సువాడ: పట్టణానికి చెందిన ముదిరాజ్ కులస్తులు సోమవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ముదిరాజ్ కులస్తుల కులదేవత పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు స్పీకర్‌ను ముదిరాజ్ సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. సంఘం నాయకులు గురువినయ్, గడుమల లింగమేశ్వర్, ఉప్పరి లింగం, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు భయాందోళనకు గురికావొద్దు


విద్యార్థులతో మాట్లాడుతున్న మనోహర్ రెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): హాస్టల్ విద్యార్థులు ఏమాత్రం భయాందోళన చెందకుండా ధైర్యంగా చదువుకోవాలని నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి సూచించారు. గోపాల్‌పేట మోడల్ స్కూల్ హాస్టల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ నిర్వహణ అధికారి వీణతో పాటు విద్యార్థులతో ఆయన మాట్లాడారు. గురువారం రాత్రి హాస్టల్‌లో జరిగిన ఘటనపై ఆయన ఆరా తీశారు. హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వహణ అధికారి వీణకు ఆయన సూచించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి


లింగంపేటలో వినతిపత్రం అందజేస్తున్న ఎండీఎం నిర్వాహకులు


మద్నూర్‌లో ధర్నా చేస్తున్న దృశ్యం

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పెండింగ్ బిల్లులు, పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండు చేస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. తమకు వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. నాలుగు నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు, 3 నెలలుగా వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నుంచి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేయడం నిలిపివేశామని ప్రభుత్వం పట్టించుకునే వరకు సమ్మె కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


నాగిరెడ్డిపేటలో..


పెద్దకొడప్‌గల్‌లో..

ఆధ్యాత్మికం

ఘనంగా చక్కెర తీర్థం



దోమకొండ: మండల కేంద్రంలోని మహంకాళి ఆలయం వద్ద సోమవారం చక్కెర తీర్థం ఘనంగా నిర్వహించారు. దోమకొండతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అమ్మవారి చీరలను ఆలయకమిటీ ఆధ్వర్యంలో వేలం వేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్, డైరెక్టర్లు రాజిరెడ్డి, నవీన్, తదితరులు ఉన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట శివారులో ఉన్న పుట్టు లింగం శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవతల పండుగల్లో భాగంగా శివాలయంలో పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. గ్రామ పెద్దలు సత్యనారాయణ, రమేష్‌కుమార్ ఉన్నారు.